జయహో భారత్.. సాహో ఇస్రో

- చంద్రయాన్–3 విజయవంతంపై హర్షం
- ప్రత్యక్ష ప్రసారం చూసి మురిసిన విద్యార్థులు



డిజిటల్ టీవీలో చంద్రయాన్ జర్నీ చూస్తున్న తోటగరువు హైస్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయులు..

ఆరిలోవ: చంద్రయాన్–3 విజయవంతం కావడంతో అంతటా హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. జయహో భారత్.. సాహో ఇస్రో అంటూ యువకులు, విద్యార్థులు సంబరాలు చేసుకున్నారు. 40 రోజుల ఉత్కంఠకు తెర దించుతూ విక్రమ్ ల్యాండర్ చందమామపై అడుగిడిన ఆ క్షణం.. భారతీయుల ఆనందానికి ఆకాశమే హద్దయింది. స్వీట్లు పంచారు. చంద్రునిపై విక్రమ్ ల్యాండర్ దిగుతున్న ప్రక్రియను ఇస్రో ప్రత్యక్ష ప్రసారం చేయడంతో అనేకమంది టీవీలకు అతుక్కుపోయారు. మరికొంతమంది తమ మొబైల్ ఫోన్లలోని యూ ట్యూబ్ ఛానెళ్ల ద్వారా ఈ ప్రసారాన్ని వీక్షించారు. చంద్రుని దక్షిణ ధ్రువంపై విక్రమ్ దిగిన వేళ దేశమంతా చప్పట్లతో మార్మోగిపోయింది. జాబిల్లి దక్షిణ ధ్రువంపై త్రివర్ణ పతాకం రెపరెపలాడిన వేళ ఆ మరపురాని ఆ మధుర క్షణాలను.. ఆ అనిర్వచనీయమైన అనుభూతిని వ్యక్తం చేశారు. బుధవారం సాయంత్రం 6.04 గంటలకు జరిగిన ఈ మధుర క్షణాలను ఆరిలోవ తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రత్యక్ష ప్రసారం ద్వారా చూసే అవకాశం కల్పించారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఈ పాఠశాలకు అందించిన డిజిటల్ టీవీల్లో చంద్రయాన్–3 ప్రయోగం ప్రత్యక్ష ప్రసారం చేశారు. ముందుగా డిప్యూటీ డీఈవో గౌరీ శంకర్ మాట్లాడుతూ చంద్రయాన్–3 ప్రాధాన్యత, అంతరిక్షంలో దాని పనితీరు, ఏవిధంగా ల్యాండ్ కాబోతుంది, తదితర విషయాల గురించి విద్యార్థులకు వివరించారు.

చంద్రయాన్–3 విజయవంతం కోసం హోమం



చినగదిలి సాయిబాబా ఆలయంలో హోమం చేస్తున్న అర్చకులు, నిర్వాహకులు

ఆరిలోవ: చంద్రయాన్–3 విజయవంతం కోసం చినగదిలి నార్త్ షిర్డీ సాయిబాబా ఆలయ ఆవరణంలోని పోలమాంబ గుడిలో బుధవారం హోమం చేశారు. సాయంత్రం 6.04 గంటలకు చంద్రుడిపై విక్రమ్ ల్యాండర్ విజయవంతంగా దిగాలని కోరుతూ సాయంత్రం 4 గంటలకు ఆలయ నిర్వాహకులు హోమం ప్రారంభించారు. ప్రయోగం విజవంతం కావడంపై హర్షం వ్యక్తం చేశారు.

ఐఐఎంలో ప్రత్యక్ష ప్రసారం



చంద్రయాన్ ప్రత్యక్షంగా వీక్షిస్తున్న ఆచార్యులు

ఏయూ క్యాంపస్: చంద్రయాన్–3 ప్రయోగం చివరి ఘట్టాన్ని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ విశాఖపట్నంలో ప్రత్యక్ష ప్రసారం చేశారు. ఐఐఎం వీ సంచాలకుడు ఆచార్య ఎం.చంద్రశేఖర్‌తో పాటు ఆచార్యులు ప్రత్యక్ష ప్రసారాన్ని వీక్షించారు. చంద్రుడిపై విజయవంతంగా విక్రమ్ రోవర్ దిగడంపై సంతోషం వ్యక్తం చేశారు. భారత అంతరిక్ష పరిశోధన సంస్థ సాధించిన ఈ విజయాన్ని మనస్ఫూర్తిగా అభినందించారు.

సాగరతీరంలో విజయోత్సవ ర్యాలీ



సాగరతీరంలో విజయోత్సవ ర్యాలీ చేస్తున్న బీజేపీ నాయకులు

బీచ్ రోడ్డు: చంద్రయాన్–3 విజయవంతం కావడంతో సాగర తీరంలో బీజేపీ నాయకులు విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. త్రివర్ణ పతాకం చేత పట్టి ఆర్కే బీచ్ నుంచి విక్టరీ ఎట్ సీ వరకు సాగిన ఈ ర్యాలీని పార్టీ అధ్యక్షురాలు పురందేశ్వరి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ జీవీఎల్ నరసింహారావు, మాజీ ఎమ్మెల్సీ పి.వి.ఎన్.మాధవ్, పాల్గొన్నారు..

ఘనత సాధించిన భారత్



ప్రపంచ దేశాల్లోనే భారత్ మంచి ఘనత సాధించింది. చంద్రయాన్–3 దక్షిణ ధ్రువాన్ని చేరడంలో ఇస్రో శాస్త్రవేత్తలు చేసిన కృషి మరువలేనిది. ఈ దృశ్యాలను చూడడం ఇప్పటితరం అదృష్టం. పాఠశాల విద్యార్థులకు డిజిటల్ టీవీలో ప్రత్యక్ష ప్రసారం చేయడం బాగుంది. ఇలాంటి ప్రయోగాలను లైవ్‌లో చూపడం వల్ల విద్యార్థుల్లో సైన్స్‌పై మరింత అవగాహన కలుగుతుంది.

– కె.నాగేంద్రబాబు, ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయుడు, తోటగరువు హైస్కూల్

అరుదైన ప్రయోగం



ఇస్రో శాస్త్రవేత్తలు చేపట్టిన చంద్రయాన్–3 ప్రయోగం అరుదైనది. ప్రపంచ దేశాలు మెచ్చిన విధంగా కొత్త మైలు రాయిని దాటారు. చంద్రుడిపై ఇంత వరకు ఎవరూ చేరుకోలేని దక్షిణ ధ్రువంపై కాలుమోపారు. ఈ ప్రయోగంపై విద్యార్థులకు ప్రత్యక్ష ప్రసారం ద్వారా వివరించడం బాగుంది.

– ఎ.స్వామినాయుడు, ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయుడు, తోటగరువు హైస్కూల్,

స్పష్టంగా కనిపించింది..



జాబిలిపై విక్రమ్ ల్యాండ్ అవడం మా పాఠశాలలో ఉన్న డిజిటల్ టీవీలో స్పష్టంగా చూశాం. ల్యాండ్ అవుతున్న సమయంలో ఉపాధ్యాయులు దాని గురించి వివరించారు. ఇంత వరకు ఇలాంటి లైవ్‌లు ఎప్పుడూ చూడలేదు. చాలా ఆనందంగా ఉంది. చంద్రయాన్ ప్రయోగం ప్రత్యక్ష ప్రసారం మా పాఠశాలలో స్క్రీన్‌పై చూడడం మాకు దక్కిన అదృష్టం.

– ఆర్.సౌజన్య, 8వ తరగతి, తోటగరువు హైస్కూల్

టెన్షన్‌తో చూశాం..



చంద్రయాన్–3 గురించి మధ్యాహ్నమే తరగతి గదిలో మా ఉపాధ్యాయులు వివరించారు. స్కూల్ విడిచిపెట్టిన అనంతరం ప్రత్యేకంగా తరగతి గదిలో డిజిటల్ టీవీలో చూపించారు. సాయంత్రం 5.30 గంటల నుంచి ఎంత త్వరగా విక్రమ్ ల్యాండ్ అవుతుందా? అంటూ టెన్షన్‌తో చూశాం. ప్రయోగం విజయవంతం కావడం ఆనందంగా ఉంది.

– పి.నివేదిత, 8వ తరగతి, తోటగరువు హైస్కూల్

మానసిక ఆస్పత్రి నుంచి రోగి అదృశ్యం

బీచ్‌రోడ్డు: ప్రభుత్వ మానసిక ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఒడిశా రాష్ట్రానికి చెందిన 33 ఏళ్ల రాష్మిత అదృశ్యమైంది. మానసిక పరిస్థితి బాగోలేక ఈ నెల 10న ఆమెను కుటుంబ సభ్యులు మానసిక ఆస్పత్రిలో చేర్పించారు. మంగళవారం ఆమెకు వైద్యం అందించేందుకు సిబ్బంది వెళ్లగా.. రాష్మిత కనిపించలేదు. దీంతో సిబ్బంది మూడో పట్టణ పోలీసులకు సమాచారమిచ్చారు. ఆమె 5.5 అడుగుల ఎత్తు, తెలుపు రంగులో ఉంటుందని పోలీసులు తెలిపారు. ఎవరికైనా కనిపిస్తే మూడో పట్టణ పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని సూచించారు.

నేడు సహస్ర తులసీదళార్చన



దాబాగార్డెన్స్: బురుజుపేట కనకమహాలక్ష్మి దేవాలయంలో ప్రతి గురువారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు సహస్ర తులసీదళార్చన నిర్వహించనున్నారు. భక్తులు రూ.1,500 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్ కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబర్ 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్0806091లో చెల్లించాలి. ఆన్‌లైన్ ద్వారా ట్రాన్స్‌ఫర్ చేసిన భక్తులు ట్రాన్సాక్షన్ వివరాలు, పూజ జరిపించాల్సిన వారి పేరు, గోత్రనామాలు, పూర్తి చిరునామా, ఫోన్ నంబర్‌ను 89855 15989కు వాట్సాప్ చేయాలి.

ఏడో రోజుకు శ్రావణలక్ష్మీ పూజలు

శ్రావణ మాసోత్సవాల్లో భాగంగా కనకమహాలక్ష్మి ఆలయంలో నిర్వహిస్తున్న లక్ష్మీ పూజలు బుధవారం నాటికి ఏడో రోజుకు చేరాయి. ఉదయం 8 గంటలకు వేదమంత్రాలు, నాదస్వరాల నడుమ ప్రారంభమైన పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. పోస్టుల ద్వారా వచ్చిన భక్తుల పేరిట పూజలు చేసి కుంకుమ, అమ్మవారి యంత్రం, ప్రసాదం పంపారు. శ్రావణలక్ష్మీ పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.400 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని కార్యనిర్వహణాధికారి కె.శిరీష తెలిపారు. వివరాలకు 0891–2711725, 2566514 నంబర్లలో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, పలువురు ధర్మకర్తలు, ఆలయ ఏఈవో కె.తిరుమలేశ్వరరావు, సిబ్బంది, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పాత పెన్షన్ కోసం వినతి



ప్రభుత్వ సలహాదారు సజ్జలకు వినతిపత్రం అందిస్తున్న ఎన్‌ఎంయూఏ రాష్ట్ర నాయకులు

మద్దిలపాలెం: ఆంధ్రప్రదేశ్ ప్రజా రవాణా శాఖలో అర్హులందరికీ పాత పెన్షన్ వర్తింపజేయాలని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు సజ్జల రామకృష్ణారెడ్డిని కలిసి విన్నవించుకున్నట్టు నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు బుధవారం విజయవాడలో సజ్జలను కలిసి వినతిపత్రం అందజేశామన్నారు. దీనిపై సజ్జల సానుకూలంగా స్పందించారన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు శ్రీనివాసరాజు, రామారావు, తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎం గొడౌన్ సందర్శన



ఈవీఎం గొడౌన్‌లో యంత్రాల రికార్డు పరిశీలిస్తున్న ఆర్డీవో భాస్కరరెడ్డి

ఆరిలోవ: రూరల్ తహసీల్దారు కార్యాలయం పక్కన ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు భద్రపరిచే గొడౌన్‌ను బుధవారం భీమిలి ఆర్డీవో భాస్కరరెడ్డి సందర్శించారు. ఈవీఎం యంత్రాలను పరిశీలించారు. ఇటీవల బెంగళూరు నుంచి తీసుకొచ్చిన వీవీ ప్యాట్లను పరిశీలించి, రికార్డులు తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో రూరల్ రెవెన్యూ అధికారులు, పలు పార్టీల నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణకు సహకరించండి



మాట్లాడుతున్న కార్పొరేటర్ ముువ్వల లక్ష్మి

ఏయూ క్యాంపస్: తూర్పు నియోజకవర్గం 20వ వార్డు పరిధిలో రోడ్డు విస్తరణలో ప్రహరీలు కోల్పోతున్న అపార్ట్‌మెంట్ల అధ్యక్ష, కార్యదర్శులతో కార్పొరేటర్ ముువ్వల లక్ష్మి బుధవారం సమావేశమయ్యారు. పోలమాంబ ఆలయం నుంచి గిరిజన్ కార్పొరేషన్ వరకు ప్రస్తుతం ఉన్న 40 అడుగుల రహదారిని 60 అడుగులకు విస్తరిస్తున్నారు. ఈ నేపథ్యంలో పలు అపార్ట్‌మెంట్ వాసులు తమ ఇబ్బందులను కార్పొరేటర్ దృష్టికి తీసుకువెళ్లారు. వారి సమస్యలను పూర్తిగా విన్న జోన్–3 ఏసీపీ శాస్త్రి, కార్పొరేటర్ ఈ విషయం జీవీఎంసీ కమిషనర్, మేయర్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. అపార్ట్‌మెంట్ వాసులకు మేలు జరిగేలా చర్యలు తీసుకోవడానికి తమవంతు సహకారం అందిస్తామన్నారు. రోడ్డు విస్తరణకు సహకరించాలని కార్పొరేటర్ కోరారు.

టంగుటూరికి ఘన నివాళి



టంగుటూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అశోక్‌కుమార్, తదితరులు

మహారాణిపేట: ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు సేవా స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ పనిచేయాలని కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్‌కుమార్ కోరారు. టంగుటూరి జయంతి సందర్భంగా బుధవారం కేజీహెచ్‌లో ఆయన చిత్ర పటానికి సూపరింటెండెంట్‌తో పాటు ఇతర అధికారులు పూలమాల వేసి నివాళులర్పించారు. సీఎస్ఆర్ఎంవో డాక్టర్ కె.వాసుదేవ, ఏఎస్ఆర్ఎంవోలు డాక్టర్ కె.జగదీష్‌కుమార్, డాక్టర్ కె.వి.అరుణకుమారి, అసిస్టెంట్ డైరెక్టర్ సిహెచ్.శ్రీనివాస్‌కుమార్, అకౌంట్ ఆఫీసర్ జోగిరాజు పాల్గొన్నారు.

విద్యా సమాచారమ్

అమృత యోగా సంస్థ ఎంవోయూ



అవగాహన ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న ప్రతినిధులు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయంతో అమృత యోగా సంస్థ అవగాహన ఒప్పందం చేసుకుంది. బుధవారం ఒప్పంద పత్రాలపై ఏయూ రెక్టార్ ఆచార్య కె.సమత సమక్షంలో రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, అమృత సంస్థ అధ్యక్షురాలు డాక్టర్ ఎ.ఇందుమణి సంతకాలు చేశారు. ఒప్పందంలో భాగంగా ఏయూ సూచించిన విధంగా ఏడాది కాల వ్యవధితో పీజీ డిప్లమో ఇన్ యోగా, ఆరు నెలల కాల వ్యవధితో డిప్లమో ఇన్ యోగా కోర్సులను అమృత సంస్థ నిర్వహిస్తుంది. ఈ కార్యక్రమంలో యోగా కేంద్రం సంచాలకుడు ఆచార్య ఒ.ఎస్.ఆర్.యు.భానుకుమార్, విభాగాధిపతి డాక్టర్ కె.రమేష్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

క్యాపిటల్ మార్కెట్‌పై అవగాహన అవసరం

ఏయూ క్యాంపస్: కామర్స్ మేనేజ్‌మెంట్ విద్యార్థులకు క్యాపిటల్ మార్కెట్‌పై అవగాహన అవసరమని ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ అన్నారు. బుధవారం ఏయూ డీజీఎంఎస్ విభాగంలో నిర్వహించిన క్యాపిటల్ మార్కెట్స్ మ్యూచువల్ ఫండ్స్ అండ్ కెరీర్ ఆపర్చునిటీస్ సదస్సులో ఆయన మాట్లాడారు. మార్కెట్‌లో మార్పులను ఎప్పటికప్పుడు తెలుసుకోవాలని, తద్వారా పెట్టుబడులు, నష్టాల నియంత్రణ అంశాలపై అవగాహన కలుగుతుందన్నారు. పెట్టుబడులు పెట్టే వారికి తగిన సూచనలు ఇస్తూ, మ్యూచువల్ ఫండ్స్ ఎంత వరకు శ్రేయస్కరం అనే అంశాన్ని వివరించారు. ఐఎస్‌సీఐ పూర్వ సీఈవో డాక్టర్ ఇ.ఎస్.రావు మాట్లాడుతూ దేశంలో మౌలిక రంగాలు గణనీయంగా వృద్ధిని సాధిస్తున్నాయన్నారు. ఆదిత్య బిర్లా సన్‌లైఫ్ మ్యూచువల్ ఫండ్స్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ కె.ఎస్.రావు మాట్లాడుతూ యువత చిన్నతనం నుంచి పొదుపు చేయడం అలవాటుగా చేసుకుంటే దేశ ఆర్థిక వ్యవస్థకు ఉపయుక్తంగా ఉంటుందన్నారు. స్ట్రాటడిగ్మ్ ఎడ్యుకేషన్ సీఈవో బి.త్యాగరాజన్ మాట్లాడుతూ బీఎఫ్ఎస్ఐ రంగంలో ఉపాధి అవకాశాలను వివరించారు. సదస్సు సంచాలకుడు ఆచార్య బి.మోహన వెంకటరామ్, విభాగాధిపతి ఆచార్య జాలాది రవి, విభాగ ఆచార్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఏయూతో ఐసీటీ అకాడమీ ఒప్పందం

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయంతో ఐసీటీ అకాడమీ అవగాహన ఒప్పందం చేసుకుంది. ఏయూ రెక్టార్ ఆచార్య కె.సమత సమక్షంలో ఒప్పంద పత్రాలపై బుధవారం రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, ఐసీటీ అకాడమీ సీఈవో హరి బాలచంద్ర సంతకాలు చేశారు. ఒప్పందంలో భాగంగా ఐసీటీ అకాడమీకి నోడల్ కేంద్రంగా ఏయూ నిలవనుంది. ఏయూ ఆచార్యులకు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఎలక్ట్రానిక్స్–కమ్యూనికేషన్ టెక్నాలజీ, మేనేజ్‌మెంట్ విభాగాల్లో అవసరమైన సేవలను ఐటీసీ అందిస్తుంది. ఈ సేవలను ఏయూతో పాటు అనుబంధ కళాశాలల అధ్యాపకులు పొందే అవకాశం ఉంది. ఏయూ ఆచార్యుల పరిశోధన పత్రాలను ఐసీటీ జర్నల్స్‌లో ప్రచురిస్తారు. కార్యక్రమంలో ఏయూ అలుమ్ని అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ ఇ.శంకరరావు, మీడియా రిలేషన్స్ డీన్ ఆచార్య చల్లా రామకృష్ణ, ఐసీటీ అకాడమీ స్టేట్ హెడ్ దినకర్ రెడ్డి, రీజినల్ మేనేజర్ బి.ప్రవీణ్ కుమార్, ఏయూ అంబేద్కర్ చైర్ ప్రొఫెసర్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ పాల్గొన్నారు

అజ్ఞానం తొలగిపోతేనే అభివృద్ధి సాధ్యం

ఎంవీపీ కాలనీ: సమాజంలో అజ్ఞానాన్ని తొలగించకుండా అభివృద్ధి సాధించలేమని సామాజిక ఉద్యమకారుడు డాక్టర్ బైరి నరేష్ అన్నారు. మూఢనమ్మకాల నిర్మూలన సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఎంవీపీ కాలనీలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా ఇన్‌చార్జిగా పక్కి రమేష్ నియమితులయ్యాలరు. అనంతరం నరేష్ మాట్లాడుతూ కుల, మత, మూఢత్వ నిర్మూలన కోసం యువత పాటు పడాలన్నారు. కులమతాల పేరిట రోజురోజుకూ ప్రస్తుత సమాజం విచ్ఛిన్నమైపోతుందన్నారు. శాస్త్రీయ దృక్పథమే మనిషిని విజ్ఞానం వైపు నడిపించగలదని ఆయన అభిప్రాయపడ్డారు. వచ్చే నెల 17న జరగనున్న సంఘం ఆవిర్భవ సమావేశాలకు అందరూ సన్నద్ధం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం అనకాపల్లి జిల్లా నాయకుడు గోల్కొండ శ్రీనివాస్, విశాఖ నాయకులు గుడాల ఈశ్వరరావు, గూడెల రాజు, కూరాకుల శంకర్‌రావు, మూలపర్తి శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

అనధికారక పార్కింగ్‌తో ట్రాఫిక్ కష్టాలు



పిఠాపురం కాలనీ నుంచి పీతలవానిపాలెం రోడ్డులో పార్క్ చేసిన వాహనాలు

మద్దిలపాలెం : జీవీఎంసీ 22వ వార్డులో వాహనాల అనధికారక పార్కింగ్‌తో ట్రాఫిక్ కష్టాలు తలెత్తుతున్నాయి. పిఠాపురం కాలనీ నాలుగు రోడ్ల కూడలి నుంచి ఇటు పితలవానిపాలెం రోడ్డును ఇటీవల రోడ్డు విస్తరణ చేపట్టి, కొత్తగా తారురోడ్డు వేశారు. దీంతో పెరిగిన రోడ్డు వెడల్పును వాహనదారులు ఎంచక్కాగా వాహనాల పార్కింగ్‌కు ఉపయోగించుకుంటున్నారు. రోడ్డు వెంబడి శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి నుంచి శివాలయం వరకూ వాహనాలు పార్కింగ్‌తో నిండిపోతోంది. శివాజీపాలెం, పీతవానిపాలెం కాలనీ వాసులు రోజూ ఉదయం, సాయంత్రం ట్రాఫిక్‌తో అవస్థలు పడుతున్నారు. ఈ రోడ్డులో అక్రమంగా పార్కింగ్ చేయకుండా ట్రాఫిక్ పోలీసులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఓటర్ల చేర్పులు, మార్పులపై దృష్టి



మాట్లాడుతున్న జేసీ విశ్వనాథన్

మహారాణిపేట: ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులు చేయడానికి అధికారులు ప్రత్యేక దృష్టి సారిస్తున్నారని జేసీ కె.ఎస్.విశ్వనాథన్ అన్నారు. బుధవారం సాయంత్రం జిల్లా జాయింట్ కలెక్టర్ చాంబర్‌లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ప్రతి వారం వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహిస్తున్నామన్నారు. రాజకీయ ప్రతినిధుల దృష్టికి వచ్చిన సమస్యలు తెలియజేస్తే పరిశీలించి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ సమావేశంలో కె.కృష్ణకాంత్(వైఎస్సార్‌సీపీ), గోపాల్‌రెడ్డి(టీడీపీ), బుద్ధ లక్ష్మీనారాయణ(బీజేపీ), ఎస్.సుధాకర్(కాంగ్రెస్), ఇతర పార్టీ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఘనంగా బీఎస్‌ఆర్ నగర్ వార్షికోత్సవం



బీఎస్‌ఆర్ నగర్‌లో నర్సింగరావు చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

ఆరిలోవ: ఎర్ర జెండాతోనే పేదలకు మేలు కలుగుతుందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కె.లోకనాథం అన్నారు. ఆరిలోవ ప్రాంతం తోటగరువు వద్ద బీఎస్‌ఆర్ నగర్ 15వ వార్షికోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. సీపీఎం నాయకులు 2008లో భూపోరాటం చేసి ఈ కాలనీని సాధించిన విషయం తెలిసిందే. ఇక్కడ ప్రస్తుతం 700 నివాసాలున్నాయి. వార్షికోత్సవంలో లోకనాథం ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ భూపోరాటం చేసి నగరంలో పలు ప్రాంతాలలో గూడు లేని పేదలకు సొంతింటి కల నెరవేర్చామన్నారు. దివంగత సీపీఎం నాయకుడు బొట్టా నర్సింగరావు పేరు పెట్టి బీఎస్‌ఆర్ నగర్‌గా ఈ కాలనీని పిలుస్తున్నామన్నారు. ఇక్కడ నివాసముంటున్న వారంతా ఐకమత్యంతో ఉండాలని సూచించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టడానికి చూస్తోందన్నారు. అటువంటి బీజేపీ శంకలో పవన్ కల్యాణ్ దూరుతున్నాడని విమర్శించారు. ఆయన చెప్పినట్లు కేంద్రం వింటుందని గొప్పలు పలుకుతున్నాడని, అవి నిజమైతే విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటుపరం చేయవద్దని కేంద్రం నుంచి హామీ తీసుకోవాలని సూచించారు. గ్యాస్ ధరలు వెంటనే తగ్గించాలని బీజేపీకి చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శులు ఎం.జగ్గునాయుడు, ఆర్.కె.ఎస్.వి.కుమార్, జిల్లా కమిటీ సభ్యురాలు పి.మణి, సీపీఎం ఆరిలోవ కార్యదర్శి సభ్యులు నరేంద్రకుమార్, కాలనీ కమిటీ సభ్యులు నాగరాజు, రమణ, నగేష్, చంద్రరావు, రంగమ్మ, సంగీతరావు, తదితరులు పాల్గొన్నారు.

గల్లంతైన వ్యక్తి మృతి



నీటిపై ఉన్న మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ దేవుడమ్మ



ఎర్ర మృతదేహం

మల్కాపురం: చేపలు పట్టేందుకు వెళ్లి గల్లంతైన ఓ వ్యక్తి.. అదే చోట శవమై తేలాడు. ఈ ఘటనకు సంబంధించి మల్కాపురం పోలీసులు తెలిపిన వివరాలివీ.. వన్‌టౌన్ రెల్లివీధి ప్రాంతానికి చెందిన మారుపల్లి ఎర్రయ్య(37) ఈ నెల 20న ఎస్‌బీసీ(షిప్ బిల్డింగ్ సెంటర్) ఎదురుగా డాక్‌యార్డ్ వంతెన వద్ద చేపలు పట్టేందుకు వచ్చాడు. ఈ క్రమంలో అతను అక్కడి సముద్ర తీరంలో గల్లంతయ్యాడు. ఈ విషయాన్ని అతనితో వచ్చిన ఓ వ్యక్తి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో.. గాలింపు చర్యలు చేపట్టారు. అతని ఆచూకీ లభ్యం కాకపోవడంతో.. ప్రత్యేక బృందాన్ని రప్పించారు. సోమ, మంగళవారాల్లో గాలింపు చర్యలు చేపట్టినా ఫలితం లేకపోయింది. చివరకు బుధవారం ఉదయం 10 గంటల సమయంలో ఎర్రయ్య మృతదేహం నీటిపైకి తేలింది. ఈ విషయాన్ని పోలీసులు అతని బంధువులకు తెలిపి.. శవ పరీక్ష నిమిత్తం మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు. కేసును ఎస్ఐ దేవుడమ్మ దర్యాప్తు చేస్తున్నారు. కాగా. ఎర్రయ్య మానసిక పరిస్థితి సరిగ్గా లేదని తెలిసింది. అతనికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. వారితో ఎర్రయ్య కలిసి ఉండటం లేదని సమాచారం.

మహిళా కళాశాలలో తెలుగు భాషా వారోత్సవాలు

అల్లిపురం: ఈ నెల 29న గిడుగు వెంకట రామమూర్తి పంతులు జయంతిని పురస్కరించుకుని విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో తెలుగు భాషా దినోత్సవ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్, రీజనల్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ ఎస్.శోభారాణి తెలిపారు. దీంట్లో భాగంగా బుధవారం కళాశాలలో తెలుగు సాహిత్యంలో విద్యార్థినులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల తెలుగు విభాగాధిపతి ఎన్‌వీ పద్మకుమారి, అధ్యాపకులు బి.రాధమ్మ, విద్యార్థినులు పాల్గొన్నారు.

జాబ్ మేళాకు విశేష స్పందన

అల్లిపురం: విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో జేకేసీ, నిర్మాణ్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన జాబ్‌మేళాకు విశేష స్పందన లభించింది. పలు ప్రముఖ కంపెనీలైన ఆటోసైన్స్, టాటా క్యాపిటల్ మైక్రో ఫైనాన్స్, అరబిందో ఫార్మా, వైఎస్‌కే ఇన్ఫోటెక్ ప్రైవేట్ లిమిటెడ్, శ్రీరామ్ ఫైనాన్స్, పేటీఎం, ఎన్ఎస్ ఇన్‌స్ట్రుమెంట్స్, టీసీఎల్ సీసాట్ పాల్గొన్న ఈ జాబ్‌మేళాకు 286 మందికి పైగా అభ్యర్థులు హాజరయ్యా రు. 66 మంది ప్లేస్‌మెంట్ పొందినట్టు జేకేసీ మెంటార్ వీఎన్ రాజు తెలిపారు. ఈ జాబ్‌మేళాలో జేకేసీ సమన్వయకర్త డి.అరుణపద్మ, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.శోభారాణి, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

డీజిల్ లోకోషెడ్‌లో డీఆర్ఎం తనిఖీలు



డీజిల్ లోకోషెడ్‌లో పరికరాలను పరిశీలిస్తున్న డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్

తాటిచెట్లపాలెం : ఈస్ట్‌కోస్ట్ రైల్వే, వాల్తేర్ డివిజన్, డివిజినల్ రైల్వే మేనేజర్ సౌరభ్ ప్రసాద్ బుధవారం డీజిల్ లోకో షెడ్‌లో పర్యటించి, అందుబాటులో గల వసతులు, పరికరాలను పరిశీలించారు. డీజిల్ లోకోలకు క్లచ్ ఒవర్ హాలింగ్ చేసే పవర్ అసెంబ్లీ బెంచ్‌ను పరిశీలించారు. అనంతరం స్మాల్ మోటార్ బెంచ్ సెక్షన్, మెటలర్జికల్ ల్యాబ్, న్యూ షెడ్‌లను పరిశీలించారు. ఆయా విభాగాల్లో గల సీనియర్ సూపర్‌వైజర్స్‌తో డీఆర్ఎం మాట్లాడారు. డీజిల్ లోకో షెడ్ నిర్వహిస్తున్న వివిధ అంశాలపై అధికారులు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు.